క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక..



నారాయణపేట: ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, పీసీసీ సభ్యుడు చిట్టెం అభిజయరెడ్డి సమక్షంలో మంగళవారం సీవీఆర్‌భవన్‌లో మాజీ కౌన్సిలర్, మైనార్టీ నాయకుడు నవాజ్ మూస కాంగ్రెస్‌లో చేరడంతో వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మనోహర్‌ప్రసాద్‌గౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్లు సుధాకర్, వేణుగోపాల్, కౌన్సిలర్ సలీం ఉన్నారు.

టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా రామస్వామి



మరికల్: రాష్ట్ర టీఎమ్మార్పీఎస్ కార్యదర్శిగా మండలానికి చెందిన జోగు రామస్వామిని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సిరసనోళ్ల బాలరాజు ఎన్నిక నియామక పత్రాన్ని అందించారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన రామస్వామిని వారు సన్మానించారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్, బాలకిష్ట, కుర్మయ్య, బాలయ్య, నర్సింహులు, కతలప్ప పాల్గొన్నారు.

అంబేడ్కర్ జాతరను జయప్రదం చేయాలి



మరికల్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగే అంబేడ్కర్ జాతరను జయప్రదం చేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సి. బాలరాజు అన్నారు. మండలంలోని మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో జాతర పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ నెల 27న మహబూబ్‌నగర్‌లో అంబేడ్కర్ కళాభవన్‌లో నిర్వహిస్తున్న మహనీయుల జయంతి సందర్భంగా ఈ జాతరను నిర్వహిస్తున్నామన్నారు. అధిక సంఖ్యలో నాయకులు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ నాయకులు బాల్‌రాజ్, రామస్వామి, బాలకృష్ణ, నర్సింహులు, కతలప్ప, కుర్మన్న, బాలయ్య పాల్గొన్నారు.

బీరప్ప ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఊట్కూరు: మండలంలోని పెద్దజట్రంలో 5 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఉత్సవాలు ఈ నెల 31నుంచి నిర్వహించే శ్రీ ఎల్లమ్మ బండారు ఉత్సవాలకు మంగళవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి కమిటీ సభ్యులు ఆహ్వానం పలికారు. ఈ నెల 31నుంచి ఏప్రిల్ 2వరకు మూడురోజులపాటు ఉత్సవాలు ఘనంగా కుర్వకులస్తులు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు తప్పక హాజరవుతానని ఎమ్మెల్యే హామీచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కుర్వ శ్రీనివాసులు, కుర్వ వడ్డెప్ప, కుర్వ వన్నప్ప, శీనప్ప పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో జేసీబీ దహనం



మాగనూర్: మండలంలోని మందిపల్లి సమీపంలో జేసీబీ దగ్ధమైన సంఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. మండలంలోని వర్కూర్‌కు చెందిన సంజీవ్ అనే వ్యక్తికి చెందిన జేసీబీ పని నిమిత్తం మందిపల్లికి తీసుకెళ్లగా మార్గమధ్యంలో జేసీబీలో వైర్లనుంచి ఏర్పడిన షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిందని తెలిపారు. ఒక్కసారిగా వచ్చిన మంటలను స్థానికులు అదుపుచేసేందుకు ప్రయత్నించిన కుదరలేదు. చివరికి ట్రాక్టర్ డ్రిప్ సిస్టంతో నీళ్లను చల్లి మంటలు అదుపు చేశారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

మహబూబ్‌నగర్ రూరల్: జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ 100 రోజుల పని కల్పించాలని ఎంపీడీఓ కరుణశ్రీ అన్నారు. మంగళవారం బొక్కలోనిపల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు పూర్తి చేసుకోవాలని కూలీలకు సూచించారు. ఉపాధి హామీ కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శి భరత్‌సింహారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ బాబురావు తదితరులు ఉన్నారు.

సైడ్ కాల్వలు ఏవి?

- ఇరువైపుల నిర్మించని డ్రైనేజీ
- రోడ్డు పైనే పారుతున్న మురుగు
- 700 మీటర్లు పొడవు ఇదే దుస్థితి
- కోతకు గురవుతున్న రోడ్డు
- అభివృద్ధి పనులకు రూ. 70లక్షల సీడీపీనిధులు



రోడ్డు నిర్మాణం లేక రోడ్డు పై పారుతున్న మురుగునీరు



సైడ్ డ్రైన్ లేక కోతకు గురవుతున్న (ఫైల్)

దామరగిద్ద: మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ చేపట్టిన ఇరువైపుల మురుగునీటి కాల్వలు నిర్మాణం చేపట్టకపోవడంతో రోడ్డుపైనే మురుగు పారుతున్న దుస్థితి నెలకొంది. గత ప్రభుత్వం దామరగిద్ద నుంచి యానగుంది వరకు 11.5కిలోమీటర్ల డబుల్‌రోడ్డు నిర్మాణానికి రూ. 13కోట్ల నిధులతో అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఏడేళ్ల క్రితం 10.08 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పూర్తి చేశారు. దామరగిద్దలో సంజీవరాయ చౌరస్తా నుంచి గ్రామ పంచాయతీ వరకు 700మీటర్లు రోడ్డుకు ఇరువైపుల ఇళ్లు ఉండటంతో గతేడాది స్థానిక ప్రజా ప్రతినిధులు చొరవతో పంచాయతీ తీర్మానం ద్వారా ఇళ్ల పంపిణీలో ప్రాధాన్యత ఇస్తామని హామీవ్వడంతో స్వచ్ఛందంగా రోడ్డు విస్తరణకు స్థలాలు వదలి సహకరించారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు కావడంతో ఎస్టిమేషన్‌లో సైడ్ డ్రైన్ లేదని కాంట్రాక్టర్ రోడ్డు మాత్రమే చేపట్టి, మురుగు కాల్వల నిర్మాణం వదిలేశారు. కాగా స్థలాలు ఇళ్లు కోల్పోయిన వారికి మాత్రం ఎలాంటి సాయం అందించలేదు.

రూ. 70లక్షల సీడీపీ నిధులు మంజూరు

స్థానిక నాయకుల చొరవతో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి గ్రామంలోని వివిధ అభివృద్ధి పనులకు రూ. 70 లక్షలు మంజూరు చేసింది. వీటితోపాటు ప్రధానంగా రోడ్డుకు ఇరువైపుల మురుగుకాల్వల నిర్మాణానికి సీడీపీ నిధుల నుంచి రూ. 20లక్షల నిధులు కేటాయించారు. వీటితోపాటు స్థానిక సీపీఎస్ స్కూల్ కిచెన్, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 3 లక్షలు, తాగునీటి బోరు, పంపుసెట్ సదుపాయానికి రూ.6.5 లక్షలు, పలు కాలనీల్లో సీసీరోడ్లు, రైతు వేదిక మరుగుదొడ్ల మరమ్మతులు, రూ. 50 వేలు, పశువైద్యశాల నిర్వహణ మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.4 లక్షలు, ఎస్సీ కమ్యూనిటీ భవనం మరమ్మతులకు రూ. 9లక్షలు, సంజీవరాయ ఆలయ మరమ్మతులకు రూ.12లక్షలు మైనార్టీ ఈద్గ మరమ్మతుకు రూ.2 లక్షలు, మైనార్టీ కబురస్తాన్ మరమ్మతులకు రూ. 5లక్షలు మంజూరు చేశారు.

ఎమ్మెల్యే చొరవతో నిధులు మంజూరు..



కొత్తగా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి చొరవతో సీడీపీ నిధుల నుంచి గ్రామంలోని వివిధ అభివృద్ధి పనులకు రూ. 70 లక్షల మంజూరు చేసింది. అందులో ప్రధానంగా సంజీవరాయ ఆలయం నుంచి జీపీ భవనం వరకు నిర్మించిన డబుల్ రోడ్డుకు ఇరువైపున సీసీ డ్రెయినేజీ మంజూరుకు రూ. 20 లక్షల నిధులు కేటాయించారు. త్వరలోనే పనులు ప్రారంభించాలని కోరుతున్నాం.

- బాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, దామరగిద్ద

వట్టిపోయిన కృష్ణానది



సాగునీరు అందక ఎండిపోయిన వరి పంట



ఎండి పోయిన పంటను చూపిస్తున్న రైతు శివప్ప

- సాగునీళ్లు లేక నెర్రలు చాస్తున్న వరిపొలాలు
- పంటను పశువులకు వదిలేస్తున్న రైతులు

మక్తల్: మండలంలోని కృష్ణానది పూర్తిగా వట్టిపోయింది. నీటితో కళకళలాడే కృష్ణానది చుక్కనీరు లేక కళావిహీనంగా మారింది. దీంతో నదితీర ప్రాంతంలో సాగుచేసిన వరిపొలాలు ఎండిపోయి నెర్రలు బారుతున్నాయి. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో నీటి మట్టం కనిష్టస్థాయికి పడిపోవడంతో నీటి ప్రాజెక్టులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికే కృష్ణానది పరివాహక ప్రాంతంలో సంగంబండ, భూత్పుర్ రిజర్వాయర్ల కింద సాగుచేసిన వరి పంటలు నీరు అందకపోవడంతో పంటలు ఎండి పోయే పరిస్థితి ఏర్పడింది. కృష్ణా నారాయణ్‌పూర్ డ్యాం, ఆలమట్టి డ్యాంలనుంచి చుక్క నీరు కూడా కిందికి విడుదల చేయకపోవడంతో కృష్ణానదిలో నీళ్లు అడుగంటిపోయాయి. నియోజకవర్గంలో మక్తల్, మాగనూర్, కృష్ణా, మండలాల్లో అధికంగా వరిపంట పొలాలు ఎండిపోతున్నాయి. నది ఎగువన ఉన్న కర్ణాటకలోని ఆలమట్టి కం బ్యారేజీల్లో నీళ్లు ఉన్నా.. దిగువకు విడుదల చేయకపోవడంపై ఇక్కడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం తాగునీటి అవసరాల కోసమైనా నీటిని విడుదల చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత



మద్యం బాటిళ్లతో పోలీసులు

మద్దూరు: వాహనాల్లో మద్యం తరలిస్తున్న క్రమంలో టాస్క్‌ఫోర్స్ పోలీసుల అందిన సమాచారం మేరకు వారిని వెంబడించి మద్యాన్ని పట్టుకున్న సంఘటనలు స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నాయి. ఎస్‌ఐ రాంలాల్ తెలిపిన మేరకు ఎం. భాస్కర్‌గౌడ్ అనే వ్యక్తి మద్దూరు నుంచి నాగిరెడ్డిపల్లికి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 23.43లీటర్ల మద్యం బాటిళ్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వాటి విలువ రూ.12వేల 420 ఉంటుందన్నారు. అలాగే నరేష్‌గౌడ్ దిచక్రవాహనంపై మద్యాన్ని మద్దూరు నుంచి తరలిస్తుండగా పట్టుకున్నారు. 39.634 లీటర్ల మద్యం విలువ రూ.39వేల 204 ఉంటుందని తెలిపారు. ఈ మద్యాన్ని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఎన్నికల సమయంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న వీరిపై కేసునమోదుచేసినట్లు ఎస్‌ఐ రాంలాల్ తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

మరికల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్‌లో 1లో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను కూల్చివేయాలని అఖిలపక్షం నాయకులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు రాజేష్, వీరన్న, వేణు మాట్లాడుతూ మండలంలోని కూరగాయాలు విక్రయాలకోసం రైతుబజార్ లేకపోవడంతో పంచాయతీ సర్వేనంబర్ 1లో మిగిలిన 30గుంటల స్థలంలో రైతుబజార్ నిర్మించాలని తీర్మానం చేశారు. ఇందుకు విరుద్ధంగా ఆ స్థలంలో అక్రమ నిర్మాణాలకు అనుమతులివ్వడం ఏమిటని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. ప్రభుత్వ భూమి కాపాడాల్సిన అధికారులే కబ్జాదారులకు అమ్ముడుపోతే తమగోడు ఎవరితో చెప్పుకోవాలని నిలదీశారు. రైతు బజార్‌కు కేటాయించిన 30గుంటల స్థలాన్ని సర్వేచేసి కంచెఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు తప్పుడు నివేదికలను ఇస్తే మాత్రం ఊరుకోమని హెచ్చరించారు. వారం రోజుల్లో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను కూల్చివేయాలని, లేనిచో ఆ స్థలంలో ప్రతి ఒక్కరూ డబ్బాలను వేసుకుంటామని హెచ్చారించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రస్తుతానికి పనులు నిలిపివేయిస్తామని వారికి తెలిపారు. కార్యక్రమంలో కృష్ణయ్య, హరీష్, రామకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, ఆంజనేయులు, కుర్మయ్య, రవి, రాజు, రఘు, నరేష్, మొగులప్ప పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డుల పరిశీలన



మద్దూరు: గ్రామ పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ జయరాములు వారిని ఆదేశించారు. మంగళవారం కొత్తపల్లిలో పంచాయతీకి సంబంధించిన ఏడు రికార్డులను పరిశీలించారు. రికార్డుల పరిశీలన అనంతరం నిర్వహణపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతి కార్యదర్శి తప్పనిసరిగా రికార్డులను సరిచేసుకోవాలన్నారు. అంతకుముందు ఎక్కమేడ్‌లోని పంచాయతీ నర్సరీని పరిశీలించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ప్రభారి బుడ్డన్న

దామరగిద్ద/ధన్వాడ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషిచేయాలని పాలమూరు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రభారి బుడ్డన్న, పేట నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రభారి సదానందరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బూత్‌లెవల్ నాయకుల సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ.. ఓటర్లను చైతన్య పర్చడంలో బూత్‌స్థాయి కార్యకర్తలే పార్టీకి కీలకమన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేసి రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణమ్మను గెలిపించాలన్నారు. కేంద్రంలో బీజేపీతోనే దేశం అభివృద్ధి సాధ్యమన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామయ్యగౌడ్, కన్వీనర్ గొల్ల నర్సింహులు, శక్తికేంద్రం ఇన్‌చార్జీలు, వెంకటయ్య, మండల నాయకులు అశోక్,మాణిక్ పాల్గొన్నారు.

టెట్ ఫీజు తగ్గించాలి

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) దరఖాస్తు రుసుంను తగ్గించాలని పీవైఎల్ నాయకులు సలీం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో ఒక్కో పేపర్‌కు రూ.300 చొప్పున ఉంటే ప్రస్తుతం రూ.వెయ్యికి పెంచడం దారుణమని విమర్శించారు. నిరుద్యోగుల నుంచి ముక్కుపిండి డబ్బులు వసూలు చేయాలని అనుకోవడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని, వెంటనే గతంలో మాదిరి పరీక్ష ఫీజును తీసుకోవాలని కోరారు.

నందిమళ్లకు బస్సుల పునరుద్ధరణ



ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని శాలువాతో సన్మానిస్తున్న విద్యార్థులు

అమరచింత: ఎన్నో ఏళ్లుగా గ్రామానికి ఆర్టీసీ బస్ సౌకర్యం లేక నందిమళ్ల గ్రామస్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి బాధలను గుర్తించిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి గ్రామానికి బస్సు వచ్చేటట్లు చొరవ తీసుకున్నారు. గద్వాల డిపో చెందిన బస్సు అమరచింత, ఆత్మకూర్ వరకు సేవలు అందించనుంది. కానీ గ్రామానికి రహదారి వ్యవస్థ సరిగా లేదని బస్ సర్వీస్‌లను నిలిపివేశారు. దీంతో గ్రామ ప్రజలతో పాటు విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన దుస్థితి దాపురించిందని, తమ గ్రామానికి బస్ సౌకర్యం కల్పించాలని ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామానికి వచ్చిన వాకిటి శ్రీహరి విన్నవించడంతో.. ఎమ్మెల్యే గెలిచిన ఆయన ఇచ్చిన హామీని నిలబెట్టుకొన్నారు. గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి జూరాల డ్యాం మీదుగా నందిమళ్ల, అమరచింత, ఆత్మకూర్ వరకు బస్ సౌకర్యం కల్పించాలని కోరడంతో వెంటనే మేనేజర్ స్పందించి బస్సు సౌకర్యం పునరుద్ధరించారు. దీంతో మంగళవారం గ్రామానికి బస్సులో వచ్చిన ఎమ్మెల్యేను విద్యార్థులు, ప్రజలు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న చేతిపంపులు



మాగనూర్: మరమ్మతులకు నోచుకోక చేతిపంపులు గ్రామాల్లో కనుమరుగవుతున్నాయి. మండల పరిధిలోని అడవిసత్యారంలో వాగు సమీపంలో ఉన్న చేతిపంపు చెడిపోయి చాలా కాలమైంది. గతంలో స్థానికులకు తాగునీరు, అవసరాలను తీర్చినచేతి పంపులు నేడు మరమ్మతులకు నోచుకోవడం లేదు. గ్రామంలో నీరురాని సమయంలో చేతిపంపు ఎంతో ఉపయోగడేవి. కాలక్రేణా మోటారు పంపులు అందుబాటులోకి రావడంతో వీటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి చేతిపంపులకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నీరులేక పంటలు ఎండిపోతుండడంతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని.. వారిని అన్నివిధాలుగా ఆదుకోవాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా సమన్వయ కర్త బిచ్చారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు.

చెన్నారెడిపల్లిలో వైద్య శిబిరం



చెన్నారెడిపల్లిలో వైద్య శిబిరం పాల్గొన్న గ్రామస్తులు

మద్దూరు: మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో మంగళవారం ఎపిక్స్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్య వాహిని వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాస్ రోగులకు రక్తపరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ మేరకు.. ట్రస్ట్ జిల్లా మేనేజర్ నర్సింహులు మాట్లాడుతూ.. చల్లా సురేష్, సాయిప్రతాప్ ఇద్దరు మిత్రులు గ్రామీణ ప్రజలకు వైద్యసేవల నిమిత్తం ఏర్పాటుచేశారని గుర్తుచేశారు. మండలంలోని మారుమూల గ్రామాలకు ప్రతివారం తిరుగుతు వైద్య పరీక్షలు, వైద్యసేవలు అందిస్తుందన్నారు. ఒకసారి రూ.50చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ఈ వాహనంలో ఉచితవైద్యం, తక్కువ ధరకు మందులు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామంలో దాదాపు 60మందికి పరీక్షలు నిర్వహిచి, వైద్యం అందించినట్లు డాక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హన్మిరెడ్డి, మేనేజర్ అఖిల్, జీఎస్‌ఎం ఆశమ్మ పాల్గొన్నారు.

'ఉపాధి' నిర్వీర్యం చేస్తే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న రాజు

ఆత్మకూర్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ రాజు అన్నారు. సోమవారం మండలంలోని జూరాలలో ఉపాధి హామీ కూలీలతో సమావేశమయ్యారు. గడిచిన పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం పథకానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపును కుదిస్తూ వస్తున్నారని, పథకాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు కార్యచరణ రూపొందిస్తున్నారని ఆరోపించారు. ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు ఇవ్వాలని, 200 రోజుల పని కల్పించాలని కోరారు. పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, రోజుకు రూ.800 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు

ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు మంగళవారం రాత్రి స్థానిక మసీదే నూర్‌లో స్టార్ గ్లాస్, హార్డ్‌వేర్ వారి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలానా అబ్దుల్‌అలీంరషాది ప్రపంచశాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు యూనూస్, అన్వర్, జహంగీర్, ఇమ్రాన్, ఇస్మాయిల్, వాహేద్, నవీద్, ముస్లిం పెద్దలు, దీక్షపరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

దేవరకద్ర: కొత్త బస్టాండ్ సమీపంలోని మల్లెల పాపయ్య కుంటలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాసరావు పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న కూలీలకు సంబంధించిన మస్టర్‌ను తనిఖీ చేశారు. అలాగే కూలీల పేర్లను చదివి వారి హాజరును పరిశీలించారు. నెలరోజులుగా ముమ్మరంగా సాగుతున్న కుంట పూడిక తీత పనులు ఏ మేరకు జరిగాయో ఏపీఓ సంజీవ్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ వీరాంజనేయులను అడిగి తెలుసుకున్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం

మాగనూర్: మండలంలోని నేరడగంలో పశ్చిమాద్రి సంస్థాన విరక్తమఠం సిద్ధలింగేశ్వర స్వామిజాతర మహోత్సాన్ని పురష్కరించుకుని మంగళవారం సిద్ధలింగ మహాస్వామివారి ఆధ్వర్యంలో కబడ్డీ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ.. యువకులలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి వారికి గొప్ప అవకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. యువకులు స్నేహభావంతో క్రీడలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అశోక్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, పవన్, శరత్, నూరిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న స్వామిజీ